


పట్టాలెక్కిన మరో 2 వందే భారత్ రైళ్లు

భువనేశ్వర్‌కు ఒకటి, సికింద్రాబాద్‌కు మరొకటి

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి కొత్తగా రెండు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిలో ఒకటి ఉదయం తొమ్మిది గంటలకు విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు బయలుదేరి వెళ్లింది. ఈ రైలు ఈ నెల 17వ తేదీ నుంచి రెగ్యులర్‌గా నడుస్తుంది. మరో రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రికి విశాఖపట్నం చేరింది. దీనికి స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. ఈ రైలు బుధవారం నుంచే రెగ్యులర్‌గా నడుస్తుంది. వీటితో పాటు వాల్తేరు డివిజన్‌లో పూర్తయిన డబ్లింగ్ పనులను, మూడో లైన్ పనులను కూడా ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైళ్ల ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని పద్మ పురస్కార గ్రహీతలు డాక్టర్ సుంకర ఆదినారాయణరావు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అధ్యక్షత వహించగా, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం సందర్భంగా ప్లాట్‌ఫారంపై విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. భువనేశ్వర్ బయలుదేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విద్యార్థులు, పలువురు ప్రముఖులను పలాస వరకు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మరొక రైలులో నగరానికి తీసుకువచ్చారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన బీజేపీ నాయకులు (ఇన్‌సెట్‌లో) రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'వన్ స్టేషన్. వన్ ప్రొడక్ట్' స్టాల్



మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్న సికింద్రాబాద్-విశాఖ- సికింద్రాబాద్ వందే భారత్ రైలుకు పూలతో స్వాగతం పలుకుతున్న రైల్వే సిబ్బంది, ప్రయాణికులు

అనకాపల్లిలో 'వన్ స్టేషన్... వన్ ప్రొడక్ట్'

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

అనకాపల్లి టౌన్, మార్చి 12: స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైల్వే శాఖ ఏర్పాటు చేసిన 'ఒక స్టేషన్.. ఒక ఉత్పత్తి' యూనిట్‌ను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశంతో రైల్వే మంత్రిత్వ శాఖ 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' పథకాన్ని ప్రారంభించింది. అనకాపల్లి ప్రాంతం బెల్లం తయారీకి ప్రసిద్ధి కావడంతో బెల్లంతో తయారుచేసే తినుబండారాల యూనిట్‌ను రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో బెల్లం అచ్చులు, నువ్వుల చిమ్మిడి, ద్రవరూపంలో వుండే బెల్లం, బెల్లం పొడి, మల్టీ మిల్లెట్స్ బిస్కెట్లు, జొన్న మురుకులు, కొర్ర జంతికలు, వివిధ రకాల పచ్చళ్లు విక్రయిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్‌లో అమ్మకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్, కామేశ్వరరావు, జీఆర్పీ ఎస్ఐ శాంతారాం, ఆర్‌పీఎఫ్ సీఐ మధు, స్టాల్ నిర్వాహకుడు ఏవీ నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి

షెడ్యూల్ విడుదల అయిన వెంటనే కోడ్ అమలు

- జిల్లాలో 12,28,635 మంది ఓటర్లు, 1,529 పోలింగ్ కేంద్రాలు
- మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి
- ఈఆర్ఓలు, ఎన్నికల సిబ్బందికి రెండు పర్యాయాలు శిక్షణ
- సభలు, సమావేశాలు, ర్యాలీలకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- అనుమతులు మంజూరుకు ప్రత్యేక విభాగం
- జిల్లాలో 330 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- అనకాపల్లిలోనే స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు
- మీడియా వర్క్‌షాప్‌లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియమ నిబంధనలను పక్కాగా అమలు చేస్తామని, ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన వెంటనే కోడ్ అమలులోకి వస్తుందని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'సార్వత్రిక ఎన్నికలు-2024, మీడియా హక్కులు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సంఘం నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, ఉల్లంఘనలపై ఫిర్యాదులు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సి-విజిల్, సువిధ తదితర అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకమని, ఎన్నికల నిర్వహణపై మీడియా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 12,28,635 ఓటర్లు ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ కోసం 1,529 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీకి ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, దివ్యాంగుల కోసం ర్యాంపులు వంటివి వుండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలియన్స్, వీడియో సర్వైలియన్స్, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ బృందాలు, అభ్యర్థుల ఖర్చుల పరిశీలకులను నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి ఇప్పటికే రెండు పర్యాయాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా వర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించేందుకు విభాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశాలు, ర్యాలీలు, సభలు నిర్వహించుకునేందుకు సువిధ యాప్‌తోపాటు ఆఫ్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అనుమతులు మంజూరు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ధ్రువీకరిస్తుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం అయ్యే ప్రకటనలు, ప్రింట్ మీడియాలో ప్రచురితమయ్యే పెయిడ్ న్యూస్‌ను ఎంసీఎంసీ పరిశీలిస్తుందని చెప్పారు. జిల్లాలో 330 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు గుర్తించామని, కేంద్ర పోలీసు బలగాలు ఆయా గ్రామాల్లో ముందస్తుగా కవాతు నిర్వహిస్తాయని ఆయన చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి. పక్కన డీపీఆర్ఓ సాయిబాబా, ఎంసీఎంసీ నోడల్ అధికారి జీవీ లక్ష్మి

అనకాపల్లిలోనే ఓట్ల లెక్కింపు

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చెప్పారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు అనకాపల్లిలోనే జరుగుతుందని తెలిపారు. ఈవీఎంలు భద్రపరచడానికి (స్ట్రాంగ్ రూమ్), ఓట్ల లెక్కింపు కోసం ... మిగతా 8వ పేజీలో

30 మంది ఎంపీడీవోలకు షోకాజ్

- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో జాప్యం
- పది రోజుల్లో వివరణ కోరిన జడ్పీ సీఈవో

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయడంలో జాప్యం చేసినందుకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 30 మంది ఎంపీడీవోలకు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు వారం క్రితం షోకాజ్ జారీచేశారు. మరికొద్దిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నది. అయితే కేవలం తొమ్మిది మండలాల్లో మాత్రమే 50 శాతం మేర పనులు కాగా మిగిలిన 30 మండలాల్లో అంతకంటే తక్కువ అయ్యాయి. దీంతో ఎంపీడీవోలకు షోకాజ్ జారీచేసిన సీఈవో, పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయాన్ని మంగళవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతి మండలానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు విడుదల చేశారు. ఇంకా జడ్పీకి వచ్చిన వాటా నుంచి ప్రతి మండలానికి సగటున రూ.20 లక్షల వరకు కేటాయించారు. ఈ నిధులతో ఆయా మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు సూచించిన మేరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పనులు చేపట్టాలి. కానీ, పంచాయతీరాజ్ ఇంజనీర్లు తీవ్ర నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు కావడం లేదన్న కారణంగా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు బడ్జెట్ ఉందని పదేపదే చెబుతున్నా మండల స్థాయిలో ఇంజనీర్లు బాధ్యత తీసుకోవడం లేదని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవో ఇటీవల మండల స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పనులు వేగవంతం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో తొలుత ఎంపీడీవోలకు షోకాజ్ ఇచ్చారు.

స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కోరం గండం

ఇదిలావుండగా మంగళవారం జడ్పీ హాలులో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాలకు సభ్యులు అతి తక్కువగా హాజరయ్యారు. వ్యక్తిగత పనులపై చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఈ సమావేశాలకు హాజరుకాకపోవడతో వైస్ చైర్మన్ సత్యవతి అధ్యక్షత వహించారు. అయితే నాలుగు, ఏడో స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కోరం లేకపోవడంతో గంటపాటు వేచి ఉండాల్సి వచ్చింది. సభ్యులకు ఫోన్ చేసి వేగంగా రావాలని జడ్పీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. సభ్యులంతా ఎమ్మెల్యేలు/సమన్వయకర్తల వెంట ఎన్నికలు ప్రచారంలో ఉన్నారంటున్నారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు కళాశాలల్లో పేదలకు కేటాయించిన సీట్ల వివరాలు ఎందుకు వెల్లడించడం లేదు

- జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులు నిలదీత
- అక్రమ గ్రావెల్, ఇసుక తవ్వకాలను అడ్డుకోకపోవడంపై అసంతృప్తి
- శిథిలావస్థకు చేరిన రహదారులను బాగుచేయాల్సిందిగా వినతి
- నిధుల కొరత ఉందన్న రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ
- ఏం సమస్య చెప్పినా నిధులు లేవంటున్నారని కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో పోలినాయుడు. పక్కన వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం...అందుకు సంబంధించిన వివరాలను ఎందుకు వెల్లడించడం లేదని భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాదు వెంకటప్పడు ప్రశ్నించారు. మంగళవారం జడ్పీ వైస్ చైర్మన్ బీవీ సత్యవతి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. రెండో స్థాయీ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీట్ల వ్యవహారంలో విద్యా శాఖ గోప్యత పాటిస్తోందని ధ్వజమెత్తారు. భీమిలి పట్టణంలో దశాబ్దాల క్రితం ప్రారంభించిన సెయింట్స్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలను మూసివేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఆ పాఠశాలను కొనసాగించేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. చీడికాడ జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా వరలక్ష్మి మాట్లాడుతూ తమ మండలంలోని వీరభద్రపేట పాఠశాలలో వసతులు లేవని, గుడివాడలో పాఠశాల ప్రహరీ నిర్మించాలని కోరగా అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాదు వెంకటప్పడు మాట్లాడుతూ నగరంలో ప్రైవేటు లేబొరేటరీలు వైద్య పరీక్షల పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నాయని ఫిర్యాదు చేశారు. అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగంలో వైద్యం అందడంలో ... మిగతా 8వ పేజీలో

గాజువాక వైసీపీలో గందరగోళం

- మరోమారు సమన్వయకర్త మార్పు
- సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడిని కాదని మొదట ఉరుకూటి రామచంద్రరావు నియామకం
- ఇప్పుడు అతని స్థానంలో మంత్రి గుడివాడ అమర్...
- నాగిరెడ్డి, రామచంద్రరావు వర్గీయుల మధ్య గొడవల నేపథ్యంలోనే ఇన్‌చార్జి మార్పు



గుడివాడ అమర్‌నాథ్



తిప్పల నాగిరెడ్డి



ఉరుకూటి రామచంద్రరావు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా ఉరుకూటి రామచంద్రరావు స్థానంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించింది. గుడివాడ అమర్‌నాథ్ 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. రెండేళ్ల కిందట పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే నెల కిందట అనకాపల్లి సమన్వయకర్తగా మలసాల భరత్‌ను అధిష్ఠానం నియమించడంతో అమర్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చ మొదలైంది. పెందుర్తి, గాజువాక, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో...ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్ భావించారు.

అయితే చోడవరం, ఎలమంచిలి సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమకు కాకుండా అమర్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని అధిష్ఠానానికి తేల్చిచెప్పారు. దీంతో పెందుర్తి, గాజువాక సీట్లపై అమర్ ఆశ పెట్టుకున్నారు. కానీ సర్వేల ఆధారంగా అధిష్ఠానం గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందూను నియమించింది. ఇదే సమయంలో అమర్‌నాథ్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పార్టీ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించడంతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దాదాపు లభించదనే అంతా అనుకున్నారు. అయితే గాజువాకలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి, సమన్వయకర్తగా నియమితుడైన ఉరుకూటి చందూకు మధ్య పొసగగపోవడంతో మంత్రి అమర్‌నాథ్‌ను గాజువాక సమన్వయకర్తగా నియమించాల్సిన పరిస్థితి అధిష్ఠానానికి ఏర్పడింది.

2019 ఎన్నికల తర్వాత గాజువాక నియోజకవర్గం సమన్వయకర్తగా సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు దేవన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. రెండు నెలల కిందట దేవన్‌రెడ్డిని సమన్వయకర్త బాధ్యతల నుంచి తొలగించి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు(చందు)ను అధిష్ఠానం ... మిగతా 8వ పేజీలో

నక్కపల్లి వైసీపీలో ముదిరిన వర్గపోరు

మినీ హాకీ స్టేడియం శంకుస్థాపన సందర్భంగా మరోసారి బయటపడిన విభేదాలు

- తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- హాజరైన వైసీపీ మండల అధ్యక్షుడు, ఇతర నేతలు
- గంట తరువాత అనుచరులతో వచ్చిన వీసం రామకృష్ణ
- మరోసారి శిలాఫలం ఆవిష్కరణ

నక్కపల్లి, మార్చి 12: మండలంలో అధికార పార్టీలో నెలకొన్న వర్గవిభేదాలు మరోసారి బహిర్గతం అయ్యాయి. మినీ హాకీ స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ వేర్వేరుగా శంకుస్థాపన చేశారు.

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో మినీ హాకీ స్టేడియం నిర్మాణానికి నక్కపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే బాబూరావు వచ్చి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వం రూ.1.6 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. అయితే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, యలమంచిలి తాతబాబు, నూకతాత తదితరులు వున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాబూరావు



శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన వీసం రామకృష్ణ

వీసం వర్గీయులు మళ్లీ శంకుస్థాపన

మినీ హాకీ స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే బాబూరావు శంకుస్థాపన చేసి వెళ్లిపోయిన సుమారు గంట తరువాత రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు తదితరులు వచ్చారు. శిలాఫలకాన్ని మరోసారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొడగట్ల పాపారావు, సాధిరెడ్డి శ్రీను, అల్లాడ కొండ, వీసం రాజు పాల్గొన్నారు. హాకీ స్టేడియం నిర్మాణానికి రెండుసార్లు శిలఫలాన్ని ఆవిష్కరించడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కిరణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, మార్చి 12: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం మండలం గురందొరపాలెం గ్రామానికి చెందిన కోసూరి కిరణ్‌కుమార్(24) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం బలిఘట్టం వైపు నుంచి నర్సీపట్నం వస్తుండగా శారదానగర్‌లోని సంపత్ వినాయకుడి గుడి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు మీద పడిపోయాడు. దీంతో తలకు, శరీరంపైన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

25 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

కృష్ణాదేవిపేట, మార్చి 12: బంగారంపేట పండగలో విక్రయించడానికి తీసుకువెళుతున్న 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని మంగళవారం అరెస్టు చేశామని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం. ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొయ్యూరు మండలం అంతాడ గ్రామానికి చెందిన వెలమ రాజుబాబు 25 మద్యం క్వార్టర్ బాటిళ్లను బంగారంపేట పండగలో విక్రయించేందుకు తీసుకువెళుతున్నాడు. గొలుగొండ మండలం కొంగసింగి జంక్షన్‌లో అతనిని పోలీసులు పట్టుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

17 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

పరవాడ, మార్చి 12: మండలంలోని తానాం గ్రామానికి చెందిన డి.అప్పలరాజు నుంచి పది మద్యం సీసాలు, నాయుడుపాలెం పంచాయతీ పరిధి కొండవానిపాలెం గ్రామానికి చెందిన పి.అప్పారావు నుంచి ఏడు మద్యం సీసాలను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నటు సీఐ బాలసూర్యారావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

మహిళ హత్య కేసులో కోడలు అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 12: కొత్తూరు పంచాయతీ పరిధిలోని దేవీనగర్‌లో సోమవారం జరిగిన సింహాద్రమ్మ హత్య కేసులో నిందితురాలైన ఆమె కోడలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. దేవీనగర్‌కు చెందిన ఈగల సింహాద్రమ్మ, ఆమె కోడలు పూర్ణ సోమవారం ఉదయం గొడవపడి, రుబ్బురోలు సన్నిగొడ్డతో తల, ముఖంపైన బలంగా మోదడంతో అత్త మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై మృతురాలి భర్త సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు పూర్ణను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

మాకవరంలో భారీ చోరీ

- నాటు తుపాకులు, కత్తులతో ఇంట్లోకి చొరబడిన దొంగలు
- రూ.2.1 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం అపహరణ


చోరీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ రమేశ్

ముంచంగిపుట్టు, మార్చి 12: మండలంలో గల మాకవరం పంచాయతీ కేంద్రంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. నాటు తుపాకులు, కత్తులతో దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి బంగారంతో పాటు నగదును అపహరించారు. దీనిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందడంతో జి.మాడుగుల సర్కిల్ సీఐ రమేశ్ సంఘటన స్థలానికి చేరుకొని చోరీపై ఆరా తీశారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకవరం గ్రామంలో పాంగి సతీశ్ తన భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలతో నివాసముంటున్నాడు. ఇల్లు, దుకాణం కలిపి ఉండడంతో వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం మండలంలో గల సుజనకోట గంగమ్మతల్లి జాతరలో దుకాణం పెట్టుకొనేందుకు అతను వెళ్లాడు. ఆ విషయాన్ని గమనించిన దొంగలు అర్ధరాత్రి వ్యాన్‌లో కత్తులు, నాటు తుపాకులతో వచ్చి సతీశ్ దుకాణం, ఇంటి తలుపులు బద్దలు గొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న సతీశ్ భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లల మెడలపై కత్తి పెట్టి కేకలు వేస్తే అందరినీ చంపేస్తామని బెదిరించారు. డబ్బులు, బంగారం ఎక్కడ ఉందని, వాటిని ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించి బీరువాలు తెరిపించి రూ.2 లక్షల 10 వేల నగదు, నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకుపోయారు. సతీశ్ ఇల్లు గ్రామానికి కొద్దిగా దూరంలో ఉండడం దొంగల పని సులువుగా మారింది. దొంగలు వెళ్లిపోయిన వెంటనే బాధిత మహిళ లక్ష్మి భయంతో కేకలు వేస్తూ మాకవరం గ్రామంలోకి పరుగులు పెట్టి గ్రామస్థులకు ఈ విషయం చెప్పింది. చోరీపై బాధితులు సతీశ్, లక్ష్మిలు స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వచ్చిన దొంగలు మొత్తం 10 మంది ఉంటారని, అందరి వద్ద కత్తులు, నాటు తుపాకులు ఉన్నాయని పోలీసులకు చెప్పారు. దీంతో జి.మాడుగుల సీఐ రమేశ్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. దొంగలు ఒడిశా ప్రాంతానికి చెందిన వారిగా అనుమానిస్తున్నారు. కొద్ది రోజులుగా ఒడిశాకు చెందిన దోపిడీ ముఠా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నాటు తుపాకులు, కత్తులతో దారి దోపిడీలకు పాల్పడుతున్నట్టు తెలిసింది.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, మార్చి 12: పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు తెలిపిన సమాచారం ప్రకారం.. గవరపాలేనికి చెందిన చదరం శ్రీనివాసరావు పొలం నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా సుంకరమెట్ట జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో శ్రీనివాసరావు కాలుకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఎనిమిది మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 12: అనకాపల్లి నుంచి మునగపాక మండలం ఒంపోలు గ్రామానికి మద్యం సీసాలు తీసుకెళుతున్న జె.సూరిబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసి, ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

'ఆహార కల్తీ నియంత్రణకు తీసుకున్న చర్యలేవి?'

అనకాపల్లి టౌన్, మార్చి 12 : రాష్ట్రంలో ఆహార కల్తీ నియంత్రణకు, ఆర్టీఐ చట్టం అమలుకు తీసుకున్న చర్యలను తక్షణం వెల్లడించాలని ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు శాఖ కమిషనర్, డైరెక్టర్ కార్యాలయాలపై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన రెండు అప్పీళ్లను మంగళవారం వర్చువల్ విధానంలో రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా విచారించారన్నారు. ఆహార కల్తీని నిరోధించడానికి, ప్రజల ఆరోగ్య రక్షణకు తీసుకుంటున్న చర్యల సమాచారం కోసం 2023 మార్చి 31 తేదీన రెండు కార్యాలయాలకు ఆర్టీఐ చట్టం కింద వేర్వేరుగా దరఖాస్తు చేశామన్నారు.

అధికార యంత్రాంగాలు పూర్తిస్థాయిలో స్పందించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌కు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో రెండు అప్పీళ్లను సమాచార కమిషనర్ విచారించారన్నారు. విచారణకు ఆహార కల్తీ నిరోధక విభాగం అధికారి హాజరయ్యారని, తీర్పు త్వరలో వెలువడనున్నదని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఫ్లైయాష్ లారీలతో సమస్యలు

- దేశపాత్రునిపాలెంలో వాహనాలను అడ్డుకున్న స్థానికులు
- కాలుష్యంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన
- చర్యలు తీసుకుంటామని సీఐ హామీ... ఆందోళన విరమణ


ఫ్లైయాష్ లారీలను అడ్డుకున్న మహిళలు

పరవాడ, మార్చి 12: సింహాద్రి ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ (బూడిద)ను ఇతర ప్రాంతాలకు రవాణా చేసే లారీలను దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఉదయం రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలను అడ్డుకున్నారు. పరిమితికి మించి ఫ్లైయాష్‌ను తీసుకెళుతుండడంతో దుమ్ము, ధూళి ఎగిసిపడి రోగాలబారిన పడుతున్నామని వాపోయారు. అంతేకాక ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అధికంగా వుండి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కాగా ఫ్లైయాష్ లారీలను దేశపాత్రునిపాలెం వద్ద స్థానికులు అడ్డుకున్నట్టు సమాచారం రావడంతో పరవాడ సీఐ బాల సూర్యారావు, సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లారు. లారీలను అడ్డుకోవడంపై స్థానికులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు రాకపోకలు సాగించే ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిదిన్నర గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడున్నర గంటల వరకు ఫ్లైయాష్ లారీలు తిరగకుండా చూడాలని మహిళలు కోరారు. సీఐ మాట్లాడుతూ, లారీల యజమానులను పిలిపించి మాట్లాడతానని, మీరు చెప్పిన సమయాల్లో లారీలు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

అన్నవరం ఆలయానికి పాదయాత్ర

- అనితకు టికెట్ రావాలని మొక్కుకున్న తెలుగు యువత నేత
- అనుకున్నది నెరవేరడంతో సత్యనారాయణస్వామి దర్శనానికి పయనం


అన్నవరం ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న తెలుగుయువత మండల అధ్యక్షుడు శ్రీనివాస్, టీడీపీ శ్రేణులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే అనిత

ఎస్.రాయవరం, మార్చి 12: మండలంలోని ధర్మవరం అగ్రహారానికి చెందిన తెలుగుయువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, కుటుంబ సభ్యులతోపాటు సుమారు 200 మంది మంగళవారం ఉదయం అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. వారితోపాటు కొంతదూరం నడిచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, పాయకరావుపేట టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు దక్కితే అన్నవరానికి నడుచుకుంటూ వెళ్లి సత్యనారాయణస్వామిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించుకుంటానని మొక్కుకున్నానని, అనితకు టికెట్ లభించడంతో మొక్కు తీర్చుకోవడానికి వెళుతున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో అనిత ఎమ్మెల్యేగా గెలవాలని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సత్యనారాయణస్వామిని కోరుకున్నానని, తన కోరిక నెరవేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మరోసారి అన్నవరం దేవస్థానానికి పాదయాత్ర చేస్తానని శ్రీనివాస్ చెప్పారు.

పీఆర్ ఇంజనీర్లపై జడ్పీ సీఈవో ఆగ్రహం

- గొర్రిగెడ్డపై వంతెన ప్రతిపాదనల సవరణను ఎందుకు పట్టించుకోలేదని నిలదీత
- సాంకేతిక అవరోధం కారణమని బదులిచ్చిన అధికారి
- అభ్యంతరాలు వస్తే తానే బాధ్యత వహిస్తానని సీఈవో స్పష్టం
- వెంటనే ప్రతిపాదనలను సవరించాలని ఆదేశం
- జడ్పీ వైస్‌చైర్మన్ బీవీ సత్యవతి అధ్యక్షతన ఏడో స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని మాడుగుల మండలం అవురువాడ వద్ద గొర్రిగెడ్డపై ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న వంతెన ప్రతిపాదనలను సవరించాలని స్వయంగా చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, పంచాయతీరాజ్ ఇంజనీర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం జడ్పీ వైస్‌చైర్మన్ బీవీ సత్యవతి అధ్యక్షతన జడ్పీ హాలులో స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఏడో స్టాండింగ్ కమిటీ సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై జరిగిన చర్చలో సీఈవో మాట్లాడుతూ, అవురువాడ పంచాయతీ శివారులోని ఆదివాసీ గ్రామాల నుంచి గిరిజన పిల్లలు అవురువాడ పాఠశాలకు రావడానికి మధ్యలో గొర్రిగెడ్డ దాటాలని, వర్షాకాలంలో వాగు దాటే క్రమంలో గతంలో ఇద్దరు పిల్లలు చనిపోయారని చెప్పారు. దీంతో గొర్రిగెడ్డపై వంతెన అవసరమని గుర్తించి 2019-20లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.2 కోట్లు మంజూరు చేశారనన్నారు. పనులు చేపట్టేందుకు చాలకాలంపాటు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, మంత్రి ముత్యాలనాయుడు జోక్యంతో ఇటీవల ఒక కాంట్రాక్టర్ వచ్చి పనులు ప్రారంభించారన్నారు. అయితే 2019-20నాటి ప్రతిపాదనలను సవరించి ప్రస్తుత రేట్ల ప్రకారం పనివిలువను మదింపు చేయాలని తాను లేఖ రాసినా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. దీనిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఒకరు బదులిస్తూ.. ఉపాధి నిధులతో మంజూరైన పనుల రేట్లు సవరించాలంటే సాంకేతికం అవరోధం ఉందని చెప్పారు. ఇందుకు సీఈవో స్పందిస్తూ.. ఈ విషయం తనకు తెలుసని, భవిష్యత్తులో అభ్యంతరాలు వస్తే సీఈవోగా తానే బాధ్యత వహిస్తానని స్పష్టం చేశారు. వెంటనే ప్రతిపాదనలు సవరించాలని ఆదేశించారు.

పంట కాలువలపై అనుమతులు లేకుండా కల్వర్టుల నిర్మాణం

పరవాడ మండలం తానాంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో పంట కాలువలపై అనుమతి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ శాఖ వారు కల్వర్టులు, వరద గోడలు నిర్మిస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఫిర్యాదుచేశారు. గత సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించినా పట్టించుకోలేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శివానందకుమార్ స్పందిస్తూ, అక్కడ పనులు చేయవద్దని తమ శాఖ ఏఈని ఆదేశించానన్నారు. బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ, మండలంలోని కోమళ్లపూడిలో ప్రజలకు తాగునీటి కోసం తవ్విన నాలుగు బోర్లకు స్థానికంగా ఉన్న కొందరు విద్యుత్ మోటార్లు బిగించుకుని వ్యవసాయానికి నీటిని వాడుకుంటున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనిపై జడ్పీ సీఈవో పోలినాయుడు స్పందించి.. తక్షణమే ఆ బోర్ల విద్యుత్ మోటార్లు తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం

- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఎన్టీఆర్ ఘనతే
- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత
- కొత్త రేవుపోలవరంలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ


కొత్త రేవుపోలవరంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించినయ అనిత, యనమల కృష్ణుడు, తదితరులు

ఎస్.రాయవరం, మార్చి 12: తెలుగుదేశం హయాంలోనే బడుగు, బలహీన వర్గాల వారికి అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం లభించిందని, వైసీపీ పాలనలో ఈ వర్గాలు అణచివేతకు గురయ్యాయని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని కొత్త రేవుపోలవరంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు యనమల కృష్ణుడుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అనిత మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని, సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఆయననేని కొనియాడారు. తెలుగుదేశం హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం సర్వనాశం అయ్యిందని ధ్వజమెత్తారు. ప్రజల బ్రతుకులు మారాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం వుందని, ఇందుకోసం వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకముందు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు ఎస్.వెంకటరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, అల్లు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ బంగారి తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి


నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

నక్కపల్లి, మార్చి 12: మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద జరిగిన సీఐటీయూ మండల సమన్వయకమిటీ సమావేశంలో ఎండీఎం రాష్ట్ర అధ్యక్షురావు జి.వరలక్ష్మి మాట్లాడారు. కనీస వేతనాల్లేక కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా వుందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజేశ్, అంగన్‌వాడీ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

చిరుతపులి చర్మం స్వాధీనం

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు


స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మం

విశాఖపట్నం, మార్చి 12: చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు యత్నిస్తున్న ముఠాను డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చిరుతపులి చర్మంతో కొంతమంది వ్యక్తులు నగరంలోకి ప్రవేశించినట్టు అందిన సమాచారంతో డైరెక్టర్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలోని దసపల్లా ప్రాంతంలో గల ఓ హోటల్‌లో ఈ ముఠాను గుర్తించారు. వారి నుంచి చిరుతపులి చర్మాన్ని స్వాధీనం చేసుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. డబ్బు సంపాదించాలనే ఆశతో చిరుతపులిని వేటాడి, చర్మాన్ని విక్రయించేందుకు ఈ ముఠా సభ్యులు విశాఖ వచ్చినట్టు భావిస్తున్నారు. నిందితుల్లో ఇద్దరు ఒడిశాకు చెందిన వారు కాగా మరో ఇద్దరు విశాఖ వాసులు. నిందితుల నుంచి చిరుతపులి చర్మంతో పాటు ఒక కారు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని అధికారులు వివరించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం చిరుతపులిని వేటాడటం, చంపడం, చర్మాన్ని అమ్మడం చట్టరీత్యా నేరమని, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడదాం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్



సీహెచ్.నాగాపురంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

కృష్ణాదేవిపేట, మార్చి 12: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడదామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం, లింగంపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లలో నాగాపురంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ఘనత మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికే దక్కిందన్నారు. వైసీపీ పాలనలో రోడ్డుపై కనీసం గోతులు పూడ్చలేని దుస్థితి ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌కు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, టీడీపీ, జనసేన నాయకులు బొప్పన ప్రసాద్, మర్సా రమణ, శ్రీకాంత్, దొరబాబు, ప్రసాద్ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు అభివృద్ధి మండలి చైర్మన్‌గా శ్రీనివాస్ నియామకం


శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

చోడవరం, మార్చి 12: చోడవరం షుగర్ కేన్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(చెరకు అభివృద్ధి మండలి) చైర్మన్‌గా సుంకర శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నుంచి మంగళవారం విజయవాడలో నియామకపత్రాన్ని అందుకున్నారు. మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాస్ ఈ పదవిలో రెండేళ్లపాటు ఉంటారు. సీడీసీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలశాఖా మంత్రి అమర్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీలకు సుంకర శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో 'పేట' విద్యార్థుల ప్రతిభ



ఎం.దేదీప్య, ఇ.నవీన్‌హర్ష

పాయకరావుపేట, మార్చి 12 : సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సీవీ.రామన్ రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు యంగ్ జీనియస్ అవార్డులు సాధించారు. మంగళవారం విద్యా సంస్థల యాజమాన్యం ప్రతినిధులు వివరాలు అందజేశారు. జనవరి 27న రాష్ట్రవ్యాప్తంగా 31వ సీవీ.రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో జనరల్ నాలెడ్జ్, మాథ్స్ సైన్స్ విభాగాల్లో తమ విద్యార్థులు ఎం.దేదీప్య, ఇ.నవీన్‌హర్ష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతోపాటు యంగ్ జీనియస్ అవార్డులు అందుకున్నారన్నారు. వీరితోపాటు జిల్లా స్థాయిలో టి.గ్రీష్మ, డి.విఖ్యాత్, ఎస్.కౌషల్‌కార్తికేయ, జి.లిఖిత్, కె.గిరిచరణ్ ప్రథమ స్థానం, ఎ.సాత్విక, ఎ.జయంత్, ఆర్.లలిత ద్వితీయ స్థానం సాధించారని, వీరందరికీ వచ్చేనెల 4న హైదరాబాద్‌లో జరిగే అభినందన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తారని తెలిపారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 14,752 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 12: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్/ ఎకనామిక్స్ పరీక్షలకు 14,752 మంది విద్యార్థులు హాజరైనట్టు ఇంటర్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. జనరల్, ఒకేషనల్ పరీక్షలకు మొత్తం 15,328 మంది హాజరు కావాల్సి ఉండగా 576 మంది హాజరు కాలేదని తెలిపారు.

పెదముషిడివాడ వీఆర్వో సస్పెన్షన్

లంకెలపాలెం, మార్చి 12: పరవాడ మండలం పెదముషిడివాడ వీఆర్వో కె.అప్పారావును సస్పెండ్ చేస్తూ జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఉత్తర్వులు జారీ చేశారని డిప్యూటీ తహసీల్దార్ శాంతి భూషణరావు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో వీఆర్వో అలసత్వం వహించారని, ప్రభుత్వ భూముల కబ్జా అవుతున్నా పట్టించుకోపోవడంతోపాటు వారికి వీఆర్వో సహకరిస్తున్నారంటూ జిల్లా ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపిన జాయింట్ కలెక్టర్.. వీఆర్వో అప్పారావుపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని నిర్ధారించుకున్నారు. దీంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇరువాడ గెడ్డ స్థలం ఆక్రమణపై విచారణ జరపాలి'

కొత్తూరు, మార్చి 12 : సబ్బవరం మండలం ఇరువాడ పంచాయతీ సర్వే నంబరు 103, 106లో ఉన్న గెడ్డ స్థలం ఆక్రమణపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మూడు ఎకరాల గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని స్థానికులు ఆందోళన చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా రక్షించి, ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సోమేశ్వరస్వామి ఆలయ నూతన కార్యవర్గం

అచ్యుతాపురం, మార్చి 12: మండలంలోని సోమేశ్వర స్వామి ఆలయ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా వారణాశి వేంకట జోగయ్య, ఉపచైర్మన్‌గా గండి అప్పలనాయుడు, డైరెక్టర్లుగా గొర్లె ప్రసన్న కుమార్, మట్ట ఈశ్వరమ్మ, జల్లూరి వరహాలు, చీపురుపల్లి సన్యాసమ్మ, పెదపాటి రాజి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, వడిసెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా హెరిటేజ్

అచ్యుతాపురం, మార్చి 12: పాడి రైతులకు అండగా హెరిటేజ్ ఎల్లవేళలా ఉంటుందని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మంగళవారం నరేంద్రపురంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని డెయిరీల కన్నా పాలు పోసిన రైతులకు తాము అధిక ధరను చెల్లిస్తున్నామన్నారు. అనంతరం పశువులకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్.రాము, ఎస్.మహేంద్ర, ఎస్.శ్యామ్, సీహెచ్.హేమంత్‌పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఎలమంచిలి, మార్చి 12: ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగు తుందని మునిసిపల్ మేనేజరు ప్రభాకరరావు తెలిపారు. చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం తీర్మానాలు చేయనుందని తెలిపారు.

తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 12: తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాసినట్టు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనం రూ.18,500 చెల్లించాలని, పీఎఫ్‌ను యాజమాన్యమే చెల్లించాలని, వారంతపు సెలవులు, పండుగ, జాతీయ సెలవు దినాలు అమలు చేయాలని, ఏ నెలకు ఆ నెల వేతనాలు చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని లేఖలో కోరినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ

అనకాపల్లి టౌన్, మార్చి 12: స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో మంగళవారం ఇండియన్ హెడ్ ఇంజ్యూరీస్ ఫౌండేషన్, హీరో మోటార్ కంపెనీ సహకారంతో క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు హెల్మెట్‌లను పంపిణీ చేసింది. రహదారి భద్రతపై అవగాహన పెంపు కార్యక్రమంలో భాగంగా సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు విద్యార్థులకు హెల్మెట్లు అందజేశారు.కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మళ్ల విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఏవీ రమణ పాల్గొనారు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అనకాపల్లి టౌన్, మార్చి 12 : జాతీయ రహదారిలోని తోటాడ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. గవరపాలెంకు చెందిన ఆడారి కుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తోటాడ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ఎస్.రాయవరం, మార్చి 12: మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని స్పందన చేయూత ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ అనిల్ వర్మ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

రాంబిల్లి, మార్చి 12: మండల కేంద్రంలో మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో రాంబిల్లి యాతపేటలో జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, స్థానికులు దేవి, రాజశ్రీ, సత్యవతి పాల్గొన్నారు.

కశింకోటలో.. మండల కేంద్రంలో మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు డీ.డీ.వరలక్ష్మి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగమణి, ఎం.స్వప్న, పుష్ప, రేవతి, సింధుజ, లక్ష్మి, ప్రవీణ, సత్యవతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.





ఎలమంచిలి సీటు టీడీపీకి కేటాయించాలి

» ఉండవల్లిలో తెలుగు తమ్ముళ్లు



ఉండవిల్లిలో ఎలమంచిలి తెలుగుదేశం పార్టీ శ్రేణులు

అచ్యుతాపురం, మార్చి 12: ఎలమంచిలి ఎమ్మెల్యే సీటు టీడీపీకే కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు మంగళవారం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుని కలిసేందుకు ఉండవల్లికి పయనమయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలని వారు కోరుతున్నారు. చంద్రబాబును కలియడానికి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, దూళి రంగనాయకులు, నాయకులు జనపరెడ్డి నరసింగరావు, మేరుగు బాపునాయుడు, పుర్రే శ్రీనివాస యాదవ్, నీరుకొండ నరసింగరావు, లాలం రాజు, కొయ్య శ్రీనివాస్, రామునాయుడు, ఆడారి మంజు, కార్యకర్తలు కార్లలో తరలివెళ్లారు.

ఉండవల్లిలో లోకేశ్‌ను కలిసిన బుద్ద



అనకాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలో మంగళవారం జరిగిన సమావేశానికి టీడీపీ జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు హాజరయ్యారు. ఈనెల 17న చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభకు ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి జనసమీకరణపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరావు అచ్చెన్నాయుడుతో పాటు సభ రవాణా కమిటీకి చెందిన పది మంది సభ్యులు హాజరై ఏర్పాట్లుపై చర్చించారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఎన్‌జిపాలెం అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కొణతాల, పీలా గోవింద

కశింకోట, మార్చి 12 : మండలంలోని నూతనగుంటపాలెం అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జనసేన-టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సింగవరంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి రూరల్, మార్చి 12 : మండలంలోని మారేడుపూడి బీసీ కాలనీలో మంగళవారం ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

సందడిగా పరదేశిమాంబ అమ్మవారి పండగ

పరవాడ, మార్చి 12 : మండల కేంద్రంలో పరదేశిమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేసి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్దఅన్నసమారాధనను ఏర్పాటు చేశారు.సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు.

ఏలేరు కాలువపై కొత్త బ్రిడ్జి ప్రారంభం

కోటవురట్ల, మార్చి 12: మండలంలోని పాములవాకలో ఏలేరు కాలువపై కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని వైసీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి విశాఖ జీవీఎంసీ రూ.2.58 కోట్లు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఏటికొప్పాక స్కూలు వార్షికోత్సవం

ఎలమంచిలి, మార్చి 12: ఏటికొప్పాక జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శానాపతి సంధ్యారాణి, నేతలు వీసం బంగారుబాబు, దేవరపల్లి రమణ, మల్లేటి ప్రసాద్, నాగేశ్వరరావు, శానాపతి రాము పాల్గొన్నారు.

కొణతాల గెలుపునకు కృషి చేస్తాం : కోట్ని బాలాజీ



కొణతాల రామకృష్ణను కలిసిన అనకాపల్లి నేతలు

తుమ్మపాల, మార్చి 12 : టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ గెలుపునకు కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో మంగళవారం సాయంత్రం కొణతాల రామకృష్ణను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం రామకృష్ణను దుశ్శాలువాను కప్పి సత్కరించారు.కార్యక్రమంలో మండల నాయకులు సబ్బవరపు గణేష్, నారపిన్ని చంద్రశేఖర్, కర్రి బాబి, ఎంపీటీసీ సభ్యుడు విజయ్, చొప్ప రమణ పాల్గొన్నారు.

ఐఓసీ సీఎస్ఆర్ నిధులతో మునిసిపాలిటీకి ఎక్స్‌కవేటర్



ఐఓసీ ఉద్యోగి నుంచి తాళాలు అందుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మార్చి 12: మునిసిపాలిటీలో చెత్త తొలగింపు పనుల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన ఎక్స్‌కవేటర్‌ను ఎమ్మెల్యే కన్నబాబు మంగళవారం మునిసిపాలిటీకి అందజేశారు. అనంతరం మునిసిపాలిటీతో పాటు మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ కొండలరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, కొక్కిరాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.

చెరకాంలో వాడుకనీటి కాలువను కప్పేశారు

» న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన దళితులు

కశింకోట, మార్చి 12: మండలంలోని చెరకాం పంచాయతీలో దళితులు నిర్మించుకున్న వాడుకనీటి కాలువను కప్పివేయడం తగదని దళితులు అత్తిమూరి నల్లమారమ్మ, అత్తిమూరి చిరంజీవి, రోజా అన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. దళితుల కాలనీలో 40 ఏళ్ల నుంచి 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వాడుకనీరు పోయేందుకు తామంతా సొంత నిధులతో ఇటీవల కాలువలను నిర్మించుకున్నామన్నారు. వాడుక నీరు కిందకు వచ్చేందుకు వీలు లేదని రాత్రి రాత్రే కాలువలను కొంతమంది కప్పివేశారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో కోరిబిల్లి దేముడు, పెదరాజమ్మ, అత్తిమూరి లక్ష్మి, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

నక్కపల్లి, మార్చి 12: మండలంలోని వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో అనంతలక్ష్మి సేవా సంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు ఆధ్వర్యంలో 90 మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మంగళవారం అందజేశారు. విద్యార్థులకు రెండు పెన్నులు, పరీక్ష రాసే పాడ్, స్కేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింగరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అయినంపూడి మణిరాజు, కె.నాగరాజు, టీఎస్ఎన్ రాజు, చినబాబు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి'

నక్కపల్లి, మార్చి 12: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో ఏర్పాటయ్యే ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే 50ఏళ్లు వయసు నిండిన బీసీలందరికీ పెన్షన్ వస్తుందన్నారు. మంగళవారం సాయంత్రం గొడిచెర్లలో టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టోలపై అవగాహన కల్పించారు. ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఉమ్మడి అభ్యర్థిని వంగలపూడి అనితను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లు అప్పలకొండ, అల్లు దేముడు, బి బాబ్జీ, కురందాసు బాబూరావు, ఎ.రమణ, దేవర రమణ, తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ స్థలాలకు రక్షణ కల్పించాలి'

పాయకరావుపేట, మార్చి 12 : పట్టణంలోని వివిధ లేఅవుట్లలో ఆక్రమణలకు గురైన పంచాయతీ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని, రక్షణ కల్పించాలని వైసీపీ నాయకుడు జగతా నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజుగారి బీడులో వేసిన లేఅవుట్‌లోని కమ్యూనిటీ స్థలంలో అనుమతి లేకుండా షెడ్డు నిర్మించి ఉందన్నారు. ఇదే లేఅవుట్‌లో మరోచోట 200 గజాల కమ్యూనిటీ స్థలం ఆక్రమణకు గురయ్యిందన్నారు. దీనిపై స్పందనలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు కమ్యూనిటీ స్థలంలో బోర్డుపెట్టి వదిలేశారు తప్ప స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదన్నారు. అదేవిధంగా మరో కమ్యూనిటీ స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతున్నా కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి పాయకరావుపేటలో లేఅవుట్లలోని పంచాయతీ స్థలాలను గుర్తించి పూర్తిస్థాయి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్‌ని వివరణ కోరగా 1వ వార్డులోని లేఅవుట్‌లోని పంచాయతీ స్థలాన్ని, షెడ్డును కూడా స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటుచేశామన్నారు. పలు లేఅవుట్లలో 37 పంచాయతీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

తుమ్మపాల షుగర్స్ కార్మికుల బకాయిల విడుదలపై హర్షం

తుమ్మపాల, మార్చి 12 : తుమ్మపాల షుగర్స్ కార్మికులకు రూ.ఐదు కోట్ల 18 లక్షల బకాయిల విడుదలపై కార్మికసంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కార్మికులు కలిసి ధన్యవాదాలు తెలిపారు.

భూ తగాదాలు పరిష్కరించేందుకే భూముల రీ సర్వే

సబ్బవరం, మార్చి 12 : గ్రామాల్లో భూ తగాదాలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని ఆరిపాకలో రీ సర్వే అనంతరం మంగళవారం రైతులకు పాస్ పుస్తకాలను ఆమె రైతులకు అందజేశారు.

జీవీఎంసీ జోనల్ ఆఫీస్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తున్న జోనల్ కమిషనర్

అనకాపల్లి టౌన్, మార్చి 12 : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మంగళవారం ప్రారంభించారు. కార్యాలయం అభివృద్ధిలో భాగంగా టాయిలెట్స్, రికార్డు రూమ్, సమావేశమందిరం కొత్తగా నిర్మించడంతోపాటు వివిధ పనుల కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వైసీపీ నాయకుడు జాజుల రమేష్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లి టౌన్/సబ్బవరం/పాయకరావుపేటరూరల్/ఎలమంచిలి, మార్చి 12 : జిల్లాలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం పలు మండలాల్లో మంగళవారం జరుపుకున్నారు. అనకాపల్లిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేకు కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. సబ్బవరంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ జెండాను అవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేశారు. పాయకరావుపేట మండలంలోని మాసాహెబ్‌పేటలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేకును కట్ చేశారు. ఎలమంచిలిలో క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎమ్మెల్యే కన్నబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ వద్ద వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పెదకలవలాపల్లి రైతులు ఉరితాళ్లతో వినూత్న నిరసన



ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాంబిల్లి, మార్చి 12 : మండలంలోని పెదపకలవలాపల్లిలో మంగళవారం 140వ రోజు నిరసన దీక్షలో భాగంగా ఉరి తాళ్లు తలకు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. గ్రామ సమీపంలోని ఉన్న కొండల చుట్టూ నేవీ ప్రహరీ గోడ నిర్మిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులు దీక్షలు చేపట్టారు. తమను స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఉపాధి కల్పించకపోతే చావే గతి అని నిరసన తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎంపీపీ

కశింకోట, మార్చి 12 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీపీ కలగ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీపీ లక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజిని, మహిళా సమాఖ్య అధ్యక్షులు వేపాడ లక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, ట్రెజరర్ పార్వతి, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా ధనిశెట్టి బాబి

పాయకరావుపేట, మార్చి 12 : పాయకరావుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడిగా ధనిశెట్టి సత్యమహేష్(బాబి) నియమితులయ్యారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా ధనిశెట్టి బాబితోపాటు పట్టణ ఉపాధ్యక్షులుగా భీమిరెడ్డి బాబ్జి, దండా లోవరాజులను నియమించినట్టుచెప్పారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ధనిశెట్టి బాబిని బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, దేవవరపు సూర్యచక్రం, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను సత్కరించి, అభినందనలు తెలిపారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

పాయకరావుపేట, మార్చి 12 : బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించిన ఆయన రానున్న రోజుల్లో బూత్ ఇన్‌చార్జిలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలిపెద్ది వెంకటరమణ, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు, కశింకోట సత్తిబాబు, దువ్వి శ్రీను, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి

... 5వ పేజీ తరువాయి

జిల్లా పోలీసు కార్యాలయానికి సమీపంలో భవనాన్ని ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నుంచి ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం ఉండదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రకటన వచ్చే నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సవరణలు జరిపిస్తామన్నారు. కొత్త ఓటర్ల చేర్పులకు ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీ ప్రకటిస్తుందని, ఆ గడువులోగా కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్‌ఓ సాయిబాబా, ఎంసీఎంసీ నోడల్ అధికారి జీవీ లక్ష్మి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి రామచంద్రరావే గాజువాక నుంచి పోటీ చేస్తారని పార్టీలో ప్రచారం జరిగింది. దీనిపై సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితోపాటు ఆయన కుమారుడు దేవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అధిష్ఠానం నాగిరెడ్డితోపాటు అతని ఇద్దరు కుమారులను విజయవాడ పిలిచి బుజ్జగించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో గాజువాకలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి చందుయే గాజువాక అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆ మరుసటిరోజు అనుచరులతో సమావేశమై ఉరుకూటి చందు అభ్యర్థిత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. చందూకు తప్ప వేరెవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. ఒకవేళ గాజువాక సీటుని యాదవ సామాజిక వర్గానికే కేటాయించాలనుకుంటే జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి ఇవ్వాలని సూచించారు. తర్వాత కూడా సమన్వయకర్త హోదాలో చందూ నిర్వహించే కార్యక్రమాలకు నాగిరెడ్డి గైర్హాజరవుతూ రావడంతో నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు కొనసాగుతూ వచ్చాయి. నియోజకవర్గంలో నాగిరెడ్డి, ఉరుకూటి చందు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిని నియోజకవర్గంలోని కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ హరివెంకటకుమారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై గాజువాక నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు బహిరంగంగా విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారు. అయినప్పటికీ మూడు రోజుల కిందట అమరావతిలో జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో కూడా ప్రస్తుతం సమన్వయకర్తలుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులంటూ పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీంతో గాజువాక అభ్యర్థిగా చందూయే పోటీ చేస్తారని అంతా భావించారు. హఠాత్తుగా గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందూని తొలగిస్తూ, అతని స్థానంలో మంత్రి అమర్‌నాథ్‌ను నియమిస్తున్నట్టు మంగళవారం పార్టీ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఇద్దరు నేతల వర్గపోరు కారణంగానే అమర్‌నాథ్‌కు అవకాశం లభించిందని పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

... 5వ పేజీ తరువాయి

జాప్యం జరుగుతుందని వైస్ చైర్మన్ సత్యవతి ఫిర్యాదు చేశారు.

ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ చినగుమ్ములూరులో ఉపాధి పథకం పనులు చేసే వారికి కూలి రేట్లలో కోత విధిస్తున్నారని ఫిర్యాదు చేయగా...చర్యలు తీసుకుంటామనా సీఈవో పోలినాయుడు తెలిపారు. పరవాడ మండలంలో ఎన్టీపీసీ నుంచి అపరిమిత బరువుతో ఫ్లైయాష్ లారీలు తిరుగుతుండడంతో రోడ్లు శిథిలావస్థకు చేరాయని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆరోపించారు. అలాగే పోర్టు నుంచి హిందూజా కంపెనీకి బొగ్గు రవాణా చేసే లారీలు 30 నుంచి 40 టన్నుల బరువుతో వస్తున్నాయన్నారు. లారీలపై టార్పాలిన్లు లేకపోవడంతో ఫ్లైయాష్, బొగ్గు ధూళి ఎగిరి దారిపొడవునా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ అడ్డరోడ్డు నుంచి మాకవరపాలెం వైపు భారీ లారీలు పరిమితికి మించి లోడుతో తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి సీఈవో స్పందించి, పరిమితికి మించి బరువుతో వెళ్లే లారీలను పట్టుకుని కేసులు రాయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.గనుల శాఖపై చర్చ సందర్భంగా పరవాడ మండలం పెదముషిడివాడలో అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆవేదన వ్యక్తంచేశారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు వరకు గ్రావెల్ తవ్వకాలు అనధికారికంగా జరుగుతున్నాయని ఆరోపించగా...అనకాపల్లి గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు బదులిస్తూ పోలీసు, రెవెన్యూశాఖ సహాయంతో దాడులు చేస్తామని చెప్పారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో పలుచోట్ల అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అడ్డురోడ్డు నుంచి పందూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తంచేయగా రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ కాంతిమతి స్పందిస్తూ...ఆ రోడ్డు నిర్మాణానికి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకురావడం లేదన్నారు. ఇందుకు నిధుల కొరత ఉందని బదులిచ్చారు. దీనిపై ఉమాదేవి మాట్లాడుతూ ఏ పని చెప్పినా నిధులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.









నర్సీపట్నం
నియోజకవర్గం

ఆచరణలోకి సంపద కేంద్రం
▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు


చెత్త సంపద కేంద్రాలు శుభ్రం చేసిన అధికారులు

మాకవరపాలెం, మార్చి 12: స్థానిక చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని పంచాయతీ కార్యదర్శి బాలదొర తెలిపారు. ఈనెల 5వ తేదీన 'చెత్త సంపద కేంద్రాలు అధ్వానం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించి మంగళవారం పాపయ్యచెరువు వద్ద ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశుభ్రం చేసి ఆచరణలోకి తీసుకు వచ్చారు. పాపయ్యచెరువులో ఉన్న చెత్తను తొలగించి, చుట్టూ ఇనుప కంచె వేశారు.

'బాల్యవివాహాలు అరికట్టాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యశ్రీ

కృష్ణాదేవిపేట, మార్చి 12 : గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగితే విద్యార్థులు పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఏఎల్‌పురం, గొలుగొండ సెక్టార్ సూపర్‌వైజర్లు సత్యశ్రీ, సత్యవతి కోరారు. మంగళవారం ఏఎల్‌పురం హైస్కూల్‌లో విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్యవివాహాలు చేస్తే కేసులు పెట్టడంతోపాటు రూ.2లక్షలు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం, సూపర్‌వైజర్ రాఘవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, భవానీ, ధనలక్ష్మి, రాజకుమారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

102 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

నర్సీపట్నం, మార్చి 12 : పట్టణంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సీఎస్ కుమార్ చిన్న పిల్లల ఆస్పత్రిలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరిగింది. మొత్తం 102 మందికి ఉచితంగా పరీక్షలు చేసి, 16 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. మరో 11 మంది రోగులను బీపీ, షుగర్ వైద్యం కోసం రిఫర్ చేశారు.

సాదాసీదాగా మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

▸▸ పారిశుధ్య డ్రైవర్ల జీతాల అంశాన్ని పక్కన పెట్టిన వైసీపీ పాలకవర్గం

నర్సీపట్నం, మార్చి 12 : మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న డ్రైవర్లపై వైసీపీ పాలకవర్గం అక్కసు ప్రదర్శించింది. ఆజెండాలో కాంట్రాక్టర్ల బిల్లులతో సహా 10 అంశాలు ఆమోదానికి పెడితే.. వాటిలో డ్రైవర్ల జీతాలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పక్కన పెట్టి మిగిలిన 9 అంశాలను ఆమోదించడం విమర్శలకు దారి తీసింది. మంగళవారం మునిసిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి ఆజెండాలో పది అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా 16వ వార్డు వైసీపీ కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి మాట్లాడుతూ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎందుకు పెట్టాల్సి వచ్చిందో వివరంగా చెప్పాలన్నారు. 13 మంది శానిటేషన్ డ్రైవర్లకు సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లించే అంశంపై కౌన్సిలర్ జగదీశ్వరి మాట్లాడుతూ ఇందులో పేర్లు అన్నీ ఎవరో అందరికీ తెలుసు, మాకు కూడా తెలుసు అని అన్నారు. బిల్లు పాస్ చేయండి అని సూచించారు. టీడీపీ కౌన్సిలర్లు సమావేశానికి రాలేదని, వారు వచ్చి ఉంటే అత్యవసర సమావేశం ఎందుకు పెట్టాల్సి వచ్చిందే తెలిసేదన్నారు. పురపాలక సంఘం కమిషనర్ పూడి రవిబాబు మాట్లాడుతూ 14, 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు వేగంగా చెల్లించడానికి పీఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో పంపాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. తర్వాత వైసీపీ కౌన్సిలర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. టీడీపీ కౌన్సిలర్లు రాకపోవడవం అత్యవసర సమావేశం అర్ధంతరంగా ముగిసింది. గత


టీడీపీ సభ్యులు గైర్హాజరుతో ఖాళీగా ఉన్న సమావేశ మందిరం

కౌన్సిల్ సమావేశంలో ఇతరులు లోపలకి ప్రవేశించడంతో వివాదంగా మారిన విషయం తెలిసిందే. అత్యవసర సమావేశంలో మళ్లీ అటువంటి సమస్య తలెత్తకుండా ఆ తలుపునకు తాళాలు వేసేశారు. ప్రత్యేకంగా వీడియో గ్రాఫర్‌ని పెట్టి వీడియో తీయించారు.

ముందుగా చెప్పలేదని...

డ్రైవర్ల జీతాలకు సంబంధించిన అంశాన్ని పక్కన పెట్టి, మిగిలిన వాటికి కౌన్సిల్ ఆమోదం తెలపడం కక్ష పూరితంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కి చెప్పకుండా డ్రైవర్ల జీతాలు పెంచే అంశాన్ని అధికారులు ఆజెండాలో పెట్టడం వివాదానికి ఒక కారణమని తెలుస్తోంది. దీనికి తోడు 13 మంది డ్రైవర్లలో టీడీపీకి చెందిన వారు ఉన్నారన్న కారణం చూపించి, రాజకీయం చేశారని విమర్శలు వస్తున్నాయి. దీని మీద వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణను వివరణ కోరగా డ్రైవర్ల అంశాన్ని పూర్తిగా పరిశీలించ లేదని, తర్వాత కౌన్సిల్ సమావేశంలో పెడతామన్నారు.

టీడీపీలోకి వైసీపీ అసంతృప్తి నేతలు

▸▸ నేడో.. రేపో చేరే అవకాశం

మాకవరపాలెం, మార్చి 12: మండలంలో వైసీపీ అసంతృప్త నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇటీవల రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద సమావేశమైన వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అడిగర్ల శ్రీనివాసరావు, వైసీపీ సీనియర్ నాయకుడు రుత్తల జమీందార్ బుధ, గురువారాల్లో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీలో చేరే అవకాశం ఉంది. ఇప్పటికే వీరంతా టీడీపీ నాయకులతో చర్చలు జరిపారు. వీరిద్దరు టీడీపీలోకి చేరితే రాచపల్లి, ఎరకన్నపాలెం, ధర్మవరం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో వైసీపీకి గట్టి దెబ్బ తగులుతుందని పలువురు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా మాకవరపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు నాలుగు నెలలుగా అధికార పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈయన మంగళవారం వజ్రగడలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. ఈనేపథ్యంలో ఈయన ఇంటిపైన ఉన్న వైసీపీ జెండాలను కూడా నెల రోజుల క్రితం తొలగించారు. తాజాగా మా నమ్మకం నువ్వే జగన్ అనే బోర్డును కూడా తొలగించడంతో ఆయన పార్టీ మారుతారంటూ గ్రామంలో ప్రచారం సాగుతోంది.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మాకవరపాలెం, మార్చి 12: మండలంలోని వజ్రగడలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్, పశువైద్య కేంద్రం భవనాలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ వెంకటగౌరీలక్ష్మి, ఎంపీడీవో చంద్రరావు, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, వైసీపీ నాయకులు కాళ్ల త్రినాథ్ పాల్గొన్నారు.

బోరు వద్ద నిలిచిన మురుగునీరు

గొలుగొండ, మార్చి 12: మండలంలోని పాత జోగంపేట సచివాలయం వద్ద ఉన్న తాగునీటి బోరు చుట్టూ మురుగు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ బోరు వద్ద తాగునీటిని వినియోగించడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు ప్లాట్‌ఫాం శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు నీరు అక్కడే నిలిచిపోతున్నది. స్థానిక పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. బోరు ప్లాట్‌ఫామ్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గాజువాక వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి రామచంద్రరావే గాజువాక నుంచి పోటీ చేస్తారని పార్టీలో ప్రచారం జరిగింది. దీనిపై సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితోపాటు ఆయన కుమారుడు దేవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అధిష్ఠానం నాగిరెడ్డితోపాటు అతని ఇద్దరు కుమారులను విజయవాడ పిలిచి బుజ్జగించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో గాజువాకలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉరుకూటి చందుయే గాజువాక అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆ మరుసటిరోజు అనుచరులతో సమావేశమై ఉరుకూటి చందు అభ్యర్థిత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. చందూకు తప్ప వేరెవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. ఒకవేళ గాజువాక సీటుని యాదవ సామాజిక వర్గానికే కేటాయించాలనుకుంటే జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి ఇవ్వాలని సూచించారు. తర్వాత కూడా సమన్వయకర్త హోదాలో చందూ నిర్వహించే కార్యక్రమాలకు నాగిరెడ్డి గైర్హాజరవుతూ రావడంతో నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు కొనసాగుతూ వచ్చాయి. నియోజకవర్గంలో నాగిరెడ్డి, ఉరుకూటి చందు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిని నియోజకవర్గంలోని కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ హరివెంకటకుమారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై గాజువాక నియోజకవర్గంలోని వైసీపీ కార్పొరేటర్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు బహిరంగంగా విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారు. అయినప్పటికీ మూడు రోజుల కిందట అమరావతిలో జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో కూడా ప్రస్తుతం సమన్వయకర్తలుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులంటూ పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీంతో గాజువాక అభ్యర్థిగా చందూయే పోటీ చేస్తారని అంతా భావించారు. హఠాత్తుగా గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందూని తొలగిస్తూ, అతని స్థానంలో మంత్రి అమర్‌నాథ్‌ను నియమిస్తున్నట్టు మంగళవారం పార్టీ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఇద్దరు నేతల వర్గపోరు కారణంగానే అమర్‌నాథ్‌కు అవకాశం లభించిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

ఉచిత సీట్లపై విద్యాశాఖ గోప్యత

... 5వ పేజీ తరువాయి

జాప్యం జరుగుతుందని వైస్ చైర్మన్ సత్యవతి ఫిర్యాదు చేశారు.

ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ చినగుమ్ములూరులో ఉపాధి పథకం పనులు చేసే వారికి కూలి రేట్లలో కోత విధిస్తున్నారని ఫిర్యాదు చేయగా..చర్యలు తీసుకుంటామనా సీఈవో పోలినాయుడు తెలిపారు. పరవాడ మండలంలో ఎన్టీపీసీ నుంచి అపరిమిత బరువుతో ఫ్లైయాష్ లారీలు తిరుగుతుండడంతో రోడ్లు శిథిలావస్థకు చేరాయని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆరోపించారు. అలాగే పోర్టు నుంచి హిందూజా కంపెనీకి బొగ్గు రవాణా చేసే లారీలు 30 నుంచి 40 టన్నుల బరువుతో వస్తున్నాయన్నారు. లారీలపై టార్పాలిన్లు లేకపోవడంతో ఫ్లైయాష్, బొగ్గు ధూళి ఎగిరి దారిపొడవునా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ అడ్డరోడ్డు నుంచి మాకవరపాలెం వైపు భారీ లారీలు పరిమితికి మించి లోడుతో తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి సీఈవో స్పందించి, పరిమితికి మించి బరువుతో వెళ్లే లారీలను పట్టుకుని కేసులు రాయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

గనుల శాఖపై చర్చ సందర్భంగా పరవాడ మండలం పెదముషిడివాడలో అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజు ఆవేదన వ్యక్తంచేశారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు వరకు గ్రావెల్ తవ్వకాలు అనధికారికంగా జరుగుతున్నాయని ఆరోపించగా...అనకాపల్లి గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు బదులిస్తూ పోలీసు, రెవెన్యూశాఖ సహాయంతో దాడులు చేస్తామని చెప్పారు. కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో పలుచోట్ల అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అడ్డురోడ్డు నుంచి పందూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తంచేయగా రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ కాంతిమతి స్పందిస్తూ...ఆ రోడ్డు నిర్మాణానికి టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకురావడం లేదన్నారు. ఇందుకు నిధుల కొరత ఉందని బదులిచ్చారు. దీనిపై ఉమాదేవి మాట్లాడుతూ ఏ పని చెప్పినా నిధులు లేవని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపించాలి


డీఎస్పీ, ఆర్డీవో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మార్చి 12 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు విషయంలో అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అల్లర్లు, గొడవలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్, డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు వీవీడీ ప్రభాకర్, ఏవీ రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. వలంటీర్ల జోక్యం లేకుండా ఎన్నికలు నిర్వహిచాలని టీడీపీ పట్టణ కార్యదర్శి వెంకటరమణ ఆర్డీవోని కోరారు.

చోడవరం
నియోజకవర్గం

వడ్డాదిలో మోదకొండమ్మ తీర్థం



బుచ్చెయ్యపేట, మార్చి 12 : వడ్డాది కూడలిలో కొలువుదీరిన మోదకొండమ్మ తీర్థం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ వేడుక జరగనుంది. తొలిరోజు వడ్డాది, బంగారుమెట్ట, విజయరామరాజుపేట, లోపూడి, ఎల్‌బీపీ అగ్రహారం తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలి ఒచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త దొండా గిరిబాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్

బుచ్చెయ్యపేట, మార్చి 12 : సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రజలంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు బలగాలు మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సీతయ్యపేట, పెదపూడి, పంగిడి, గొర్లెపాలెం, గున్నెంపూడి, పెదమదీన గ్రామాల్లోని వీధుల్లో కవాతు జరిపారు. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో ముగిసిన ఉత్సవాలు


సినీ గాయకుడు కారుణ్యను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, మార్చి 12 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. ముగింపోత్సవం సందర్భంగా సినీ గాయకుడు ఇండియన్ ఐడల్ ఫేం కారుణ్య ఆలపించిన శివ కీర్తనలు, పాటలు అందరినీ విశేషంగా అలరించాయి. అనంతరం ఆయనను విప్ ధర్మశ్రీ సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ, సభ్యులు, దేవదాయశాఖ ఈవో సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి, శ్రీనివాస్ తదితరులు ఈ వేడుకలను నిర్వహించారు.

హైస్కూల్‌లో డైనింగ్ హాలు నిర్మాణానికి శ్రీకారం

చోడవరం, మార్చి 12 : ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాల కోసం డైనింగ్ హాలు నిర్మాణ పనులకు పూర్వ విద్యార్థులు మంగళవారం శ్రీకారం చుట్టారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు వెంకటపతిరాజు తదితరులు ఎంపీ విజయేంద్రప్రసాద్‌ను కలిసి రూ.25 లక్షలు మంజూరు చేయించిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో హైస్కూల్‌లో చేపట్టనున్న పనులకు సంబంధించి పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు టీవీ రమణమూర్తి, వజల బాబు తదితరులు స్థల పరిశీలన చేసి, మార్కింగ్ కార్యక్రమాలను ప్రారంభించారు.

15 మద్యం బాటిళ్ల స్వాధీనం

చోడవరం, మార్చి 12 : పట్టణ శివారు నరసయ్యపేటలో ఓ టిఫిన్ హోటల్‌లో నడుస్తున్న బెల్టు షాపుపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అక్రమంగా ఉంచిన 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడు దండు వరహాలుపై కేసు నమోదు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

సమావేశాల్లో ఇలా.. నిధుల కేటాయింపులో అలా..?

▸▸ విప్ ధర్మశ్రీని నిలదీసిన మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ ▸▸ సమస్యలపై మరికొందరు ఆగ్రహం ▸▸ వాడీవేడిగా రావికమతం మండల సమావేశం



సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెపుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం, మార్చి 12 : 'సమావేశాలు జరిగినప్పుడు సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలని చెపుతుంటారు. కానీ నిధుల కేటాయింపులో మాత్రం వివక్ష చూపుతున్నారు' అని మరుపాక ఎంపిటీసీ సభ్యుడు ముత్యా సూర్యనారాయణ ప్రభుత్వ విప్‌ను నిలదీశారు. దీనిపై స్పందించిన కరణం ధర్మశ్రీ తాను నిధుల కేటాయింపులో అందరినీ సమానంగా చూడాలని ఎంపీపీకి తెలిపాని చెపుతుండగానే.. సదరు ఎంపీటీసీ ఎంపీపీ పైల రాజును సైతం ఇదే అంశంపై ప్రశ్నించడంతో ఆయన నీళ్లు నమిలారు. మంగళవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన రావికమతం మండల సర్వసభ్య సమావేశం కాస్త వాడీవేడిగా సాగింది. అభివృద్ధి పనుల నిధుల కేటాయింపు విషయంలో తనకు జరిగిన అన్యాయంపై టీడీపీకి చెందిన ఎంపీటీసీ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. చేసిన మంచి పనులే ప్రజాప్రతినిధులకు గుర్తింపును తెస్తాయన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎంపీటీసీ ముత్యా సూర్యనారాయణ కల్పించుకొని పైవిధంగా ప్రశ్నలు సంధించారు. అధికార పార్టీకి చెందిన పాలక వర్గం టీడీపీ ఎంపీటీసీలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. మండల పరిషత్ నిధులు తమ సెగ్మెంటుకు కేటాయించలేదని, మీరే ఇవ్వొద్దు అన్నట్టుగా మాకు తెలిసింది అని ఆరోపించారు. దీనిని విప్ ధర్మశ్రీ ఖండించారు. అనంతరం నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను విప్ వివరించారు. కొత్తకోటలో సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ పూడి దేవా మండిపడ్డారు. ఒక్క కొత్తకోటలోనే కాదు.. మరుపాకలో కూడా ఇదే పరిస్థితి అని, దీనికి కారణం ఇంజనీరింగ్ అధికారిణి సుమతి అని మరుపాక సర్పంచ్ పండూరి సత్తిబాబు ఆరోపించారు. అనంతరం కొత్తకోట ఎంపిటీసీ దేవా మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై ఎన్ని సమావేశాల్లో ప్రస్తావించినా ఏమాత్రం పరిష్కారం కాలేదని ఆరోపించారు. మరికొంత మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అతనితో గొంతు కలిపి ఏఈ తీరుపై ధ్వజమెత్తారు. ఇలాగైతే మండల సమావేశానికి రాలేమని సభ్యులు తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భానోజీరావు, తహసీల్దార్ రమణారావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 12 : వడ్డాది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రత్యేకాధికారిణి అన్నపూర్ణ కోరారు. ఆరో తరగతి, ఇంటర్ (బైపీసీ) ఇంగ్లీషు మీడియంలలో ప్రవేశాలకు గాను వచ్చే నెల 11వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయట చిన్నారులు, డ్రాపౌట్స్ పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తుదారుల కుటుంబ ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.4 లక్షలలోపు ఉండాలన్నారు పూర్తి వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరు 18004258599ను సంప్రదించాల్సిందిగా కోరారు.

'ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి'

చోడవరం, మార్చి 12 : రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసీపీ విజయమే అందరి లక్ష్యం కావాలని విప్ ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకన్నపాలెంలో మంగళవారం వైఎస్ విగ్రహానికి నివాళులర్పించి వైసీపీ ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు డీవీఆర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక, మాజీ జట్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, సర్పంచ్ మొల్లి సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి పలువురు బాసట

చోడవరం, మార్చి 12 : ఉపాధి పనుల కోసం ఇతర ప్రాంతానికి వెళ్లి మృతిచెందిన పట్టణంలోని రైతుబజారు సమీపంలో నివసిస్తున్న కార్మికుడు పసుపులేటి రమేష్ కుటుంబానికి సీపీఐ, అనుబంధ మహిళా సంఘాల సభ్యులు మంగళవారం నిత్యావసర సరకులు అందజేశారు. మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గోవాడ కనకమహాలక్ష్మి, సోమాదుల దేవి, లక్ష్మీకాంతం, వరలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

352 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు, మార్చి 12 : సూదివలస ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 352 మంది రోగులకు లంకవానిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ రామారెడ్డి రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారిణి ఇ.నాగలక్ష్మి పర్యవేక్షించారు. ఎంపీటీసీ సభ్యులు వర్రి రామునాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ జవ్వాది సన్యాసిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ సురక్షిత నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : బూడి


వింటిపాలెంలో వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ/దేవరాపల్లి, మార్చి 12 : రాష్ట్రంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలం లోని జి.కొత్తపల్లి, వరహాపురం, తునివలస, వింటిపాలెం గ్రామాల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులను, జల్‌జీవన్ మిషన్ పనులను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సర్పంచులు గొల్లవిల్లి చిన్నమ్మలు, పడాల హైమ, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా వుంటే, దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలో మంగళవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి హాజరై తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ మండల ఉపాధ్యక్షురాలు చింతల బుల్లి లక్ష్మి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, బూరే బాబూరావు, చింతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

రోలుగుంట, మార్చి 12 : ఇక్కడి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రవిచంద్ర తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఉండాలన్నారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు నేడు ఎన్నికలపై శిక్షణ

నర్సీపట్నం అర్బన్, మార్చి 12: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన ఎన్నికల నిర్వాహణపై బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ప్రారంభించే శిక్షణకు మండలంలోని బీఎల్వోలకు, సూపర్‌వైజర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

గొల్లలపాలెంలో పైడితల్లమ్మ పండగ

కె.కోటపాడు, మార్చి 12 : కింతాడ శివారు గొల్లలపాలెంలో పైడితల్లమ్మ పండగను మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. పోతురాజు (గావు) స్వామి పండగకు ముందుగా ఈ వేడుక జరపడం ఆనవాయితీ. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు.

పాకలపాడులో చిరుధాన్యాల సాగుపై ర్యాలీ

గొలుగొండ, మార్చి 12: మండంలోని పాకలపాడు గ్రామంలో నవధాన్యాల సాగు.. నేల తల్లి బాగు అనే అంశంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సాగు స్టేట్ రీసోర్సు పర్సన్ దేవుళ్లు మాట్లాడుతూ.. రైతులు ఎరువులు, పురుగుమందులు తగ్గించి, చిరుధాన్యాలను సాగు చేపడితే నేలతల్లి పాడవదన్నారు. ఈ ర్యాలీలో స్థానిక రైతులు, పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి

... 5వ పేజీ తరువాయి

జిల్లా పోలీసు కార్యాలయానికి సమీపంలో భవనాన్ని ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నుంచి ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం ఉండదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రకటన వచ్చే నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సవరణలు జరిపిస్తామన్నారు. కొత్త ఓటర్ల చేర్పులకు ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీ ప్రకటిస్తుందని, ఆ గడువులోగా కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ సాయిబాబా, ఎంసీఎంసీ నోడల్ అధికారి జీవీ లక్ష్మి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

గ్రామాల్లో వైభవోపేతంగా తీర్థాలు

మాడుగుల రూరల్, మార్చి 12 : వీరవల్లి అగ్రహారంలో కొలువైన మోదకొండమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిచారు. పెద్ద సంఖ్యలో భక్తులలు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరహాపురంలో గంగాలమ్మ గావు పండగ


గంగాలమ్మకు పూజలు

చీడికాడ, మార్చి 12 : మండలంలో వరహాపురంలో గంగాలమ్మ గావుపండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి ఈ వేడుక జరుగుతుంది. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దరించుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కోలాటం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డిప్యూటీ సీఎం బూడి, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు రూ.10వేలు చొప్పున విరాళాలు అందజేశారు.

మాడుగులలో అభయాంజనేయ వేడుక



మాడుగుల, మార్చి 12 : మాడుగుల అర్బన్ కాలనీలో అభయాంజనేయ స్వామి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఎడ్లబండ్ల లాగుడు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొంగలున్నారు.. జాగ్రత్త

బైక్‌తో పడి పోయినట్టు యువకుల నాటకాలు..
కాపాడాలని వెళితే సెల్‌ఫోన్ చోరీ

నర్సీపట్నం, మార్చి 12: పుణ్యానికి పోతే.. పాపం ఎదురవ్వడం అంటే ఇదేనేమో.. పట్టణంలోని ఒక హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న కర్రి రామారావు ఆదివారం సాయంత్రం 7.30 నుంచి 8 గంటల మధ్యలో ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నుంచి మెయిన్ రోడ్డులో నడుచుకుంటూ వస్తున్నాడు. ఇంతలో బైక్ మీద వచ్చిన ఒక యువకుడు పడిపోతున్నట్టు బండి కిందకు వంచాడు. నిజంగానే పడిపోతున్నాడని అనుకొని సాయం చేయడానికి రామారావు వంగున్నాడు. ఈలోపు మరో యువకుడు అక్కడకు వచ్చి రామారావుతోపాటు సాయం చేసి బైక్ పైకి లేపారు. సాయం చేయడానికి వచ్చిన యువకుడు, పడిపోయినట్టు నటించిన యువకుడు ఇద్దరు బైక్ మీద పరారయ్యారు. చొక్కా జేబు తేలిక అవ్వడంతో సెల్‌ఫోన్ పోయిందని గ్రహించిన రామారావు గగ్గోలు పెట్టాడు. ఈ తరహా చోరీలు ఇటీవల పట్టణంలో చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. బైక్‌తో పడి పోయినట్టు నటించడం, సాయం చేయడానికి వచ్చిన వ్యక్తుల జేబుల్లోని సెల్ ఫోన్లు చోరీ చేయడం జరుగుతోంది. ఇటీవల శారదానగర్‌లో వాకింగ్ వెళ్లి వస్తున్న వృద్ధుడు సెల్‌ఫోన్ కూడా ఇదే తరహాలో ఇద్దరు యువకులు చోరీ చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.